## కథ

-తటవర్తి రామచంద్రరావు

# మళ్ళీ

**ఆశాజీవి కన్నుల కాంతిలా బయట ఎండ కాస్తోంది. తనకున్నదంతా ఇతరులకి పంచి ఇచ్చేసే నిస్వార్థజీవి మనస్సులా చల్లగాలి మెల్లిగా వీస్తోంది.**

**ఎండలో చల్లగాలి కోసం వేచివున్న వాడిలా గుమ్మంవైపే చూస్తున్నాడు నారాయణ. భుజం మీది కండువాని సర్దుకుంటూ మెట్లెక్కి వచ్చాడు వెంకట్రావు.**

''అమ్మయ్య! వచ్చావా?'' అని హాయిగా నిట్టూర్చాడు నారాయణ.

''నీ వొంట్లో ఎలా వుంది?'' అతని మంచం పక్క కుర్చీలో కూర్చుంటూ అడిగాడు వెంకట్రావు.

''ఓ రోజు బాగుంటే ఇంకోరోజు బాగుండదు. నా మూలంగా నీకూ శ్రమ!''

''స్నేహితుల మధ్య శ్రమ అన్న పదం వాడకూడదు''

''కొంచెం బిందెలోంచి నీళ్ళు తీసుకొని తాగుతావా?''

''భలేవాడివే! దాహమేస్తే నేను తాగనూ! జానకమ్మ ఇంట్లో వుండుంటే తను తెచ్చేది కాదూ!''

నారాయణ లేచి కూర్చున్నాడు.

''జానకమ్మ మ్యూజిక్ క్లాసు ఇంకా ఎంత సేపుంటుందో!''

''పిల్లాడ్ని స్కూలుకి పంపి నాకన్నీ చేసి పెట్టి వెళ్ళింది. రెండు చోట్లకి వెళ్ళాలి. మీరు తిరిగొచ్చాక మళ్ళీ మరో చోటకి వెళ్ళాలి. పాపం, నా మూలంగా జానకి ఎన్ని అవస్థలు పడుతోందో!''

అప్పుడే ఒక మంచి కథలోని ఉదాత్తమైన పాత్రలా జానకి లోపలికి వచ్చింది.

''వచ్చారా! మీరెప్పుడొస్తారా, శ్రీధర్ దగ్గరకి ఎప్పుడు వెడదామా అని చూస్తున్నాం''

''మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది జానకమ్మా! ఎవరి దగ్గర్నించి డబ్బు కొట్టేద్దామా అని కాపుకాసే నక్కలున్న ఈ జనారణ్యంలో దగ్గరున్నది ఇతరులకి ఎంత త్వరగా ఇచ్చేద్దామా అని తొందరపడే మిమ్మల్ని చూసాక...''

''భలేవారే! అది మా డబ్బు కాదు. సరస్వతి కష్టార్జితం. ఆమె కొడుక్కి భద్రంగా అందివ్వటం మా బాధ్యత. అందులో మా గొప్పేముందండి!''

''అవున్లేమ్మా! నువ్వలా కాక ఇంకేమంటావు?''

''ఉండండి. కొంచెం కాఫీ కలిపి తెస్తాను''

''వద్దమ్మా! మనకి ఆలశ్యమౌతుంది''

''అవును జానకీ! త్వరగా వెళ్ళొచ్చెయ్యండి'' అన్నాడు నారాయణ.

తలవూపి ''ఇప్పుడే వస్తానన్నయ్యగారూ!'' అంటూ లోపలికి వెళ్ళింది జానకి.

''నువ్వు నిశ్చింతగా కళ్ళు మూసుకొని పడుకో!'' అన్నాడు వెంకట్రావు.

''నువ్వు దగ్గరుండగా నాకు చింత దేనికి?''

మిత్రుడి నవ్వుతో శ్రుతి కలిపి కండువా సరి చేసుకొని చెప్పుల్లో కాళ్ళు పెట్టాడు వెంకట్రావు. తిరిగి వచ్చిన జానకి భర్త ఒంటిమీద ప్రేమగా చెయ్యివేసి కళ్ళతోనే సంజ్ఞ చేసి వెంకట్రావు వెంట నడిచింది.

ఆటోలో వెడుతుండగా ''శ్రీధర్ నిన్ను హోటలుకి వచ్చి కలవమనటం నాకు బాగా లేదమ్మా!'' అన్నాడు వెంకట్రావు.

''అయ్యో! ఆ పిల్లాడు నన్ను రమ్మనలేదండీ! తనిలా కంపెనీ పని మీద వస్తున్నానని కేవలం మూడు రోజులుంటానని వీలయితే కలుస్తానని ఫోన్‌లో చెప్పాడు. ఎప్పుడో ఐదేళ్ళ క్రితం వెళ్ళిపోయాడు. ఏ జరూరు పనిలో ఉన్నాడో, ఇంటికి రాగలడో లేడో''

''అవున్లే! తల్లిపోయినప్పుడే రాని వాడు, ఆంటీ కోసం ఇంటి దాకా వస్తాడా? అమెరికా సంస్కృతిని బాగా ఒంటపట్టించుకునే ఉంటాడు. వాళ్ళు క్షణాల్ని డాలర్లలో కొలుస్తారు. మీ యింటికి వస్తే ఏం లాభం?''

''అంత మాటనకండి అన్నయ్యగారూ! ఏ కొడుకయినా తల్లి పోయిందంటే బాధపడకుండా ఉంటాడా? అందులో శ్రీధర్ అలాంటి వాడు కాదు. చిన్నప్పట్నించీ మాకు తెల్సిన పిల్లాడు. పాపం, అప్పుడే అతనికీ కారు ఆక్సిడెంటయిందిట! రాలేని పరిస్థితి. జరిగిందానికి బాధపడద్దని వీలున్నప్పుడు ఓసారి రమ్మని నేనే ఫోన్‌లో చెప్పాను. ఇన్నాళ్ళకి వస్తున్నాడు. అదే మనకి కావల్సింది. మన మీద అపేక్ష లేనివాడయితే ఇప్పుడొస్తున్నానని మాత్రం ఫోన్ చేస్తాడా? మళ్ళీ ఎప్పటికి రాగలుగుతాడో ఏమో! మన పరిస్థితులు ఎలా ఉంటాయో ఏమో! మన బాధ్యత తీర్చుకుందామని.. అంతే!''

స్వచ్ఛమైన ఆమె అంతఃకరణ ఆమె ముఖంలో మెరుస్తోంది. ఆ కాంతికి కళ్ళు మిరిమిట్లు కొలిపినవాడిలా వెంకట్రావు కళ్ళు మూసుకున్నాడు.

హోటలు దగ్గర దిగాక ఆటోవాడికి అతను డబ్బులిస్తే ''అయ్యో! మీరిచ్చారేమిటి?'' అంది ఆమె నొచ్చుకుంటూ.

''ఆడవాళ్ళ చేత డబ్బు ఖర్చుపెట్టించటం అనాగరికత. కావాలంటే, మీ అమెరికా అబ్బాయినడుగు'' అని నవ్వాడు వెంకట్రావు.

''ఇప్పటికే మాకోసం మీరెంతో చేస్తున్నారు''

''నీ స్నేహితురాలి కోసం నువ్వు చేస్తున్నదానితో పోలిస్తే నా స్నేహితుడికి నేను చేస్తున్నదెంత?''

రిసెప్షన్‌లో శ్రీధర్ గురించి అడిగాడు వెంకట్రావు. అమెరికా నుంచి వచ్చిన బిజినెస్‌మన్‌తో ఇండియాలోని ఈ సాదా మనుషులకి పనేమిటో-అన్నట్టు చూసి ''ఆయనతో మీకేం పని?'' అని ఇంగ్లీషులో అడిగాడు రిసెప్షనిస్టు.

''ఆంటీ జానకి ఇక్కడ వెయిట్ చేస్తోందని చెప్పండి చాలు''


''సారీ! ఆయన రూమ్‌లో లేరు. ముఖ్యమైన మీటింగులో ఉన్నారు''

ఓ కాగితం మీద జానకి అడ్రసు రాసి ''ఈ స్లిప్‌ని ఆయనకి పంపించండి. మెనీ థేంక్స్!'' అన్నాడు వెంకట్రావు.

ఆ ఒక్క మాటలో మేజిక్ ఉంది. వాళ్ళని వెయిట్ చేయమని లాంజ్‌లోని సోఫాల్ని చూపించాడు రిసెప్షనిస్టు.

సోఫాలో కూర్చున్నాక పెద్ద ఎత్తువున్న గోడల్ని, కర్టెన్లని, ఫ్లవర్ పాట్స్‌ని టిప్‌టాప్‌గా అటూ యిటూ తిరుగుతున్న హోటలు సిబ్బందిని, డాబుగా బయటకి లోపలకి వచ్చే జనాన్ని తేరిపార చూసి ''ఈ హోటల్లో రోజుకి గది అద్దె ఎంతుంటుందంటారు అన్నయ్యగారూ!'' అని అమాయకంగా అడిగింది జానకి.

''అబ్బే, ఎంతోనా? చాలా చవక. నారాయణది, నాది నెల జీతాలు కలిపినంత. ఇక నువ్వు మ్యూజిక్ క్లాసులు మీద నెలంతా సంపాదించింది పెడితే ఓ పూట నీకు, మీ ఆయనకి భోజనానికి సరిపోవచ్చు. ఎప్పుడైనా మీరిద్దరూ ఇక్కడికి రావాలనుకుంటే.. ఆ పూట మీ పిల్లాడ్ని మా యింటికి భోజనానికి పంపు'' అన్నాడు సీరియస్‌గా.




గబుక్కున చీర చెంగుని నోటికడ్డం పెట్టుకుని పొంగి వచ్చే నవ్వు నాపుకుంది ఆమె.

ఇంతలో రిసెప్షనిస్టు పిలిచాడు. ఆమెనక్కడే ఉండమని వెంకట్రావు వెళ్ళివచ్చాడు.

''నువ్వు వచ్చిన సంగతి శ్రీధర్‌కి తెల్సింది. ఇంకా ఆ మీటింగు ఓ అర గంట ఉంటుందిట''

''నా మూలంగా మీకాలశ్యమవుతుందేమో!'' అంది ఆమె ఇబ్బందిగా ముఖం పెట్టి.

''అదేంటమ్మా అలాగంటావు. మెత్తటి సోఫాలు, ఎ.సి.వాతావరణం, ఎంత డబ్బెట్టినా ఇవి బయట దొరుకుతాయా?''

''ముందే తెల్సుంటే పాపం వదిన గార్ని కూడా తీసుకువచ్చేవాళ్ళం''

''అమ్మో! ఈ సంగతి మా ఆవిడకి మాత్రం చెప్పకు. నిజంగానే ఇక్కడికి తీసుకు వెళ్ళమని అనగలదు''

వాళ్ళలా సరదాగా మాట్లాడుకుంటూ అరగంట గడిపినా శ్రీధర్ రాలేదు. ఏం మాట్లాడుకోకుండా దిక్కులు చూస్తుండగా మరో అరగంట గడిచిపోయింది.

''ఆయన్ని వదిలిపెట్టి వచ్చి చాలా సేపయింది. పిల్లాడు స్కూలు నుంచి వచ్చుంటాడు. ఆ తర్వాత మ్యూజిక్ క్లాసుకోటి వెళ్ళాలి. పోనీ, వెళ్ళిపోయి రేపు వద్దామా?''

''అసలు అతను ఇంటికి రాలేకపోతాడనేగా మనమింత దూరం వచ్చింది! నువ్వు వచ్చి వెయిట్ చేస్తున్నావని తెల్సినా అతను రాలేదు. రేపుమాత్రం మన కోసం అతను పనులు మానుకొని ఉంటాడని భరోసా ఏముంది? అతని ప్రోగ్రాము గురించి మనకి తెలీదు. ఇంత సేపు ఆగాం. మరికొంత సేపు ఆగటమే మంచిది. పోనీ నారాయణకి ఫోన్ చేసి వస్తాను''

''సారీ అన్నయ్యగారూ! ఫోను పని చేయటం లేదు'' అంది బిడియపడుతూ.

''అదేమిటి? రాత్రి మాట్లాడాను''

''ఇన్నాళ్ళూ ఇన్కమింగ్ పనిచేసింది. బిల్లు కట్టలేదని ఇవేళ తీసేసారు''

''అయ్యో! ఎంత పని జరిగింది. ఇప్పుడు మీకు ఫోను అవసరం ఎంతో ఉంది కదా! నా దగ్గర మొహమాటమేమిటి? నాతో ఎందుకు చెప్పలేదు?''

''జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడో సాయం చేసిపెట్టండి''

''ఏమిటమ్మా!''

''మరికొంతసేపుండి శ్రీధర్‌కి ఇదివ్వగలరా?''

''ఇదేదో పెద్ద పని అయినట్టు చెపుతావేమిటి?''

''మా యింట్లో కాఫీ యిస్తానంటే వద్దన్నారు. ఇక్కడ ఏమీ త్రాగలేదు. ఇంట్లో ఎప్పుడు తిన్నారో ఏమో! ఇంకా మిమ్మల్ని ఉండమనటం నాకు బాధగా ఉంది''

''అన్నానికేముందమ్మా! రోజూ తినేదే! ఇవేళ నీ పుణ్యంలో పాలు పంచుకునే అవకాశం ఇస్తున్నావు. అదే మహద్భాగ్యం నాకు''

★ ★ ★

మరో అరగంట తర్వాత సూటులో వున్న వ్యక్తితో రిసెప్షనిస్టు తనను చూపించి ఏదో చెపుతూంటే తనకు కావల్సిన వ్యక్తి అతనేనని గ్రహించి అటు నడిచాడు వెంకట్రావు.

''నా పేరు శ్రీధర్..మీరు?''

తనెవరో, నారాయణతో తన స్నేహానుబంధమెలాంటిదో చెప్పాడు వెంకట్రావు.

''ఆంటీ..వచ్చారని..''

''చాలాసేపు వెయిట్ చేసింది. పాపం, ఇంట్లో పనులు. వచ్చిన పని నాకప్పగించి వెళ్ళిపోయింది''

''వచ్చిన పని ఏమిటి?''

అటూ ఇటూ చూసి ''మీ గదికి వెడదామా?'' అన్నాడు వెంకట్రావు.

''ఇక్కడ చెప్పకూడదా? మళ్ళీ ఓ గంటలో నాకు మీటింగు ఉంది''

''పోనీ, మీరు ఇవాళో రేపో జానకమ్మ వాళ్ళింటికి రాగలరా?''

''సారీ, కచ్చితంగా వస్తానని చెప్పలేను''

''అందుకే, జానకమ్మ ఇక్కడికి వచ్చింది. మీరమెరికా నుంచి వచ్చారు. మీ టైము చాలా విలువైనది. నేను వృధాగా ఇబ్బంది పెట్టను. ఒక్క ఐదు నిమిషాలు స్పేర్ చేస్తే..''

''సరే పదండి'' అని తన గదికి

అతన్ని తీసుకు వెళ్ళాడు శ్రీధర్. కాఫీ లకి ఆర్డరిచ్చి ''ఇప్పుడు చెప్పండి'' అన్నాడు.

''మీ అమ్మగారు, జానకమ్మ ప్రాణ స్నేహితులని..''

''అవన్నీ నాకు తెల్సు. ముందు ఆంటీ ఇక్కడికి ఎందుకు వచ్చారో చెప్పండి''

''ఆమె ఇప్పుడిక్కడ ఉండుంటే మీతో ఏం చెప్పేదో నాకు తెలీదు. కానీ ఆమె నాకప్పగించిన బాధ్యత ఇది'' అంటూ బేగ్ తెరిచి ఓ పేకెట్‌ని బయ టికి తీసి అతని చేతుల్లో పెట్టాడు వెంకట్రావు.


ఆ నోట్ల కట్టలు చూసి తెల్లబోయాడు శ్రీధర్.

''మీ అమ్మగారు జానకమ్మ దగ్గర తరచు దాచుకున్న డబ్బు కొంత. ఆవిడ చనిపోతే మీ యిల్లు బాగు చేయించి అద్దెకిస్తే వచ్చింది మరి కొంత. బ్యాంకు వడ్డీ కొంత. అంతా కలిపి రెండు లక్షల ఇరవై రెండు వేలు. ఆ వివరాలన్నీ లిస్టురాసి పెట్టింది''

''ఇప్పుడిదంతా ఎందుకండీ?''

''ఎందుకంటారేమిటి? ఇది మీ డబ్బు. అది మీకు భద్రంగా ఇవ్వాలని రెండు రోజు ల్నుంచి బ్యాంకులమ్మట తిరిగి డిపాజిట్లు మూసేసి తెచ్చింది''

''అబ్బ, ఇప్పుడిది నాకెంత ప్రొబ్లమ్ తెచ్చి పెట్టిందో తెలుసా?''





''మీ డబ్బు మీరు తీసుకోవటానికి ప్రొబ్లమ్ ఏమిటి? నాకర్థం కాలేదు''

''ఇక్కడ నేనుండేది రెండ్రోజులు. లక్షల డాలర్ల మీద జరిగే వ్యాపారం గురించి నాకు

## హిమాలయాలకి రజనీకాంత్

**తను నటించిన ప్రతి సినిమా పూర్తి కాగానే హిమాలయాలకి ప్రయాణం కట్టేయడం రజనీ కాంత్‌కి అలవాటు. అలాగే ఇప్పుడు కూడా ఇటీవలే 'శివాజీ' చిత్రానికి సంబంధించిన అన్ని పనులూ పూర్తవగానే హిమాలయాలకి బయ ల్దేరి వెళ్ళిపోయాడు రజనీ. అక్కడ తగిన మాన సిక ప్రశాంతతని పొంది తిరిగి రావడం రజనీకి రెగ్యులర్ ప్రాక్టీస్ అని అందరికీ తెలుసు. 'శివాజీ' విడుదలకు ముందు చెన్నయ్ చేరుకుం టాడని భావిస్తున్నారు. ఈ లెక్కన 'శివాజీ' సినిమా జూన్ నెలలోనే విడుదల కానున్నదని అంచనాలు వేసుకోవచ్చు.**



ముఖ్యమైన మీటింగులున్నాయి. ఆ పని చూసుకోనా, ఈ చిల్లర తీసుకుని డ్రాఫ్టుల కోసం బ్యాంకుకి వెళ్ళనా?''

''అవసరానికి మీ చేతుల్లో కేషు ఉంటుందని- మీకిబ్బంది కలిగించాలని జానకమ్మ ఈ పని చేయలేదు''

''ఇంటర్నేషనల్ క్రెడిట్ కార్డులు చెలామణీ అవుతున్న రోజులండీయివి. ఇంత కేషు పట్టుకొని ఎవరూ తిరగరు'' అన్నాడు శ్రీధర్ కాస్త చిరాగ్గా.

''పాపం, మీ ఆంటీ అంత దూరం ఆలోచించలేదు. పోనీ బ్యాంకుకి వెళ్ళి నేను డ్రాఫ్టు తెచ్చి పెడతాను. ఇదేం పెద్ద యిస్యూ కాదు''

అప్పటికి శ్రీధర్ ముఖం వికసిం చింది. ''మెనీ థేంక్స్! మీకు ట్రబులి స్తున్నాను''

''అదేం లేదు. మీ డబ్బు మీకి వ్వటం జానకమ్మ లక్ష్యం. మీకెలా అందినా ఆమె సంతోషిస్తుంది!''

అప్పుడే రూమ్‌బోయ్ కాఫీలు తెచ్చాడు. శ్రీధర్ అందించిన కాఫీ కప్పు నందుకుంటూ ''ఇక అమెరి కాలో సెటిల్ అయిపోయినట్టేనా? ఇండియాకి తిరిగి వచ్చే ఉద్దేశ ముందా?'' అన్నాడు వెంకట్రావు.

శ్రీధర్ నవ్వులో వ్యంగ్యం. ''ఇక్కడేముం దండీ! మట్టి''

''అంటే?''

''ఎక్కడ చూసినా స్కాములు, కబ్జాలు, లూటీలు..పొలిటీషియన్లు, గూండాలు చేతులు కలిపి దేశాన్నంతా దోచుకుతింటు న్నారు. ఇన్ని ఘోరాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. ఇక్కడే ముందని నన్ను రమ్మంటారు? ఈ వ్యవస్థ మారేవరకూ ఇక్కడికి రావటం దండగ. నా జీవితంలో అది మారుతుందని నాకు నమ్మకం లేదు''

''నేనడిగిన వ్యవధి అయిపోయింది. లేక పోతే మీ ప్రశ్నకి జవాబు చెప్పేవాడ్ని'' అన్నాడు వెంకట్రావు జేవురించిన ముఖంతో.


ఆ మాటల్లోని తీవ్రతని శ్రీధర్ గుర్తించ లేదు. మర్నాడు అతనితో పని వుందని మెత్త పడిన వాడిలా ''ఫర్వాలేదు చెప్పండి'' అన్నాడు.


''మీ తల్లితండ్రుల జన్మ భూమి ఇది. మీరు చదువుకున్న కర్మభూమి ఇది. ఇక్కడ చదువు కుని ఉండకపోతే మీరు అమెరికా వెళ్ళి సక్సెస్ కాగలిగే వారా? ఒక్క ఐదేళ్ళల్లో ఈ వ్యవస్థ అంతా కుళ్ళిపోలేదే! ఒకవేళ మీరు వెళ్ళాక మరీ పాడయిపోయిందనుకున్నా అక్కడ అమెరికాలో కూర్చుని ఇక్కడ వ్యవస్థని విమర్శించటం మీకు భావ్యమా? నీళ్ళల్లో అడుగుపెట్టందే ఎవ రైనా ఈదగలరా? ఇక్కడికి రాకుండా ఈ వ్యవ స్థని మీరు మార్చగలరా? మీరు మార్చలేని వ్యవ స్థని విమర్శించే హక్కు- మీకెక్కడుంది?''

''ప్రభుత్వం ప్రోత్సహించే పనినే మా అమ్మా నాన్నా చేసారు. కులాంతర వివాహం చేసుకున్నారు. కానీ వాళ్ళకి దొరికిందేమిటి? సంఘంలో వెలి. బంధువుల్లో నిరాదరణ. మా నాన్న పోయాక మా అమ్మ ఎన్నో ఇబ్బందులు

పడాల్సిన వచ్చింది. ఇప్పుడా అమ్మే లేకపోయాక నాకీ దేశంతో సంబంధ మేముంది?''

''లేదనుకునే వాళ్ళకి ఏ సంబంధమూ ఉండదు. ఉందనుకుంటే అన్నీ ఉంటాయి. సరస్వతమ్మని బంధువులు చేరదీయకపోయినా ఆదరించి అక్కున చేర్చుకున్న జానకమ్మ లాంటి ఆత్మీయులు లేరా? ఇక్కడ పరాయి సొమ్ముని లూటీ చేసే వాళ్ళే కాదు. అవకాశమొచ్చినా ఇతరుల సొమ్ముని ముట్టని నిస్వార్థ జీవులూ ఉన్నారు. మీ పెద్ద యింట్లో జానకమ్మ ఉండి తనివ్వగలిగిన అద్దె యిచ్చి ఉంటే మీరభ్యంతరం పెట్టి వుండే వాళ్ళు కాదు. అయినా ఆమె అలా చేయలేదు. మీకు లాభం కలగాలని ఇంకెవరో ఎక్కువ అద్దె యిస్తానంటే ఆ యిల్లు ఇచ్చింది. లక్షల డాలర్లు సంపాదించే మీకు ఈ రెండు లక్షల చిల్లర రూపాయిలు, మీ యింటి మీద వచ్చే అద్దె పెద్ద లెక్కలోకి రాకపోవచ్చు. మీకు వీటి అవసరమూ ఉండకపోవచ్చు. కానీ జానకమ్మకి ఇప్పుడు డబ్బెంతో అవసరం. అయినా ఇంత డబ్బు చేతుల్లో ఉన్నా



ఆమె ఒక్క రూపాయి కూడా ముట్టలేదు''

''ఆంటీకి డబ్బవసరమా? ఫోన్‌లో ఆ మాట చెప్పలేదే?''

''చెప్పి మిమ్మల్ని బాధపెడుతుందా? అయినా నిజం నిజమే! భరించలేని పరిస్థితి. నారాయణ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. రెండు కిడ్నీలూ పాడయిపోయాయి. మెడికల్ లీవు అయిపోయింది. ప్రావిడెంటు ఫండు ఖర్చయిపోయింది. జీతం నష్టం మీద నెట్టుకు వస్తున్నాడు. అతను బ్రతికి బయట పడాలంటే ఎవరైనా కిడ్నీ ఇవ్వాలి. ఆపరేషన్‌కి డబ్బు కావాలి. అంతా లక్షల మీద పని. జానకమ్మ ఎక్కడ్నించి తేగలదు? తన మ్యూజిక్ క్లాసుల మీద సంపాదించి తెస్తే కానీ నారాయణ డయాలిసిస్ ఖర్చు గడవటం లేదు. చివరికి టెలిఫోన్ బిల్లు కట్టటానిక్కూడా డబ్బు లేకపోయింది. ఇవేళ ఆ ఫోన్ డిస్కనక్ట్ అయిపోయింది. ఇంత దుస్థితిలో కూడా ఆమె ఈ డబ్బు ముట్టుకోలేదు. ఎందుకని? అది సరస్వతమ్మ ఇచ్చిన సొమ్ము. అది భద్రంగా ఆమె వారసుడికివ్వాలి. తన స్నేహితురాలు తన మీద పెట్టుకున్న నమ్మకమది. ఆ శక్తిముందు తన వ్యక్తిగత బాధలు లెక్కలోకి రావు. ప్రాణాంతకమవుతున్నా స్వార్థం తొంగి చూడదు. ఇలాంటి త్యాగమూర్తులు మీ అమెరికాలో కనిపిస్తారా?'' అతని గొంతు గాద్గదికమైంది.

''సార్!''

''సారీ, మీరుంటున్న దేశాన్ని, మీరిష్టపడుతున్న ప్రదేశాన్ని తక్కువ చేసి మాట్లాడ్డం నా ఉద్దేశ్యం కాదు. ఇది మట్టి అని మీరు నిందించినప్పుడు ఇక్కడ అణగిమణగి వున్న మాణిక్యాన్ని గురించి నాకు చెప్పక తప్పలేదు. మీరు గౌరవించలేకపోతున్న ఈ మట్టిలో నలువైపులా పరిమళించే మానవత్వం ఉంది. తోటిమనిషికి సుఖాలు పంచియిచ్చే దాతృత్వముంది. కష్టాల్లో పాలు పంచుకునే ఆర్ద్రత ఉంది. ఇవేవీ చూడలేని వాళ్ళకి ఇక్కడ మనుషుల్లోని రాక్షసులు మాత్రమే కనిపిస్తారు. దేవతలు కనిపించరు!''

శ్రీధర్ అవాక్కయిపోయాడు.

''మీతో తన ఇబ్బందుల గురించి జానకమ్మ పొరపాటున కూడా చెప్పుండేది కాదు. నన్ను చెప్పనిచ్చేది కాదు. కాని, మీ మాట విన్నాక ఉండబట్టలేక పోయాను. నా మాటలు మిమ్మల్నే విధంగానయినా బాధ పెట్టి వుంటే క్షమించండి. ఇప్పటికే మీ టైము చాలా తీసుకున్నాను. వస్తాను'' అంటూ పైకి లేచాడు వెంకట్రావు.

యాంత్రికంగా తనూ పైకి లేచాడు శ్రీధర్.

''చెప్పటం మరిచాను. దీంట్లో డబ్బే కాదు ఓ కవరు కూడా ఉంది. దాంట్లో మీ యింటి డాక్యుమెంట్లున్నాయిట. అన్నీ చూసుకోండి''

★ ★ ★

మర్నాడు ప్రొద్దున్న చెప్పిన వేళకి వెంకట్రావు హోటలుకి వెళ్ళాడు. రిసెప్షన్‌లో శ్రీధర్ గురించి ఎంక్వయిరీ చేసాడు.

''ఆయన మీటింగుకి వెళ్ళారు. మీరొస్తే యివ్వమన్నారు'' అని ఓ సీల్డు కవరుని అందిం

## అదండీ సంగతి!


నటుడు-దర్శకుడు ఎస్.జె.సూర్యతో మీరా జాస్మిన్ ఎఫైర్ గురించిన వార్తలు ఇటీవల జోరుగా ప్రచారంలో వున్నాయి. అయితే ఈ వార్తల గురించి మీరా కామెంట్ చేస్తూ- 'సూర్య మంచి నటుడు, దర్శకుడు. అంతకుమించి నాకు మంచి మిత్రుడు. అంతేగానీ ఎవరో అనుకుంటున్నట్టు మా ఇద్దరి మధ్యా ఎలాంటి ఎఫైర్లూ లేవు. టైంపాస్ కోసం కొంతమంది పనిగట్టుకుని చేసే ఇలాంటి పుకార్లని నేను పట్టించుకోను' అని తేల్చిపారేసింది మీరా. అంతే కాదు, తను ఎవరి బాకింగ్ లేకుండానే ఒంటరిగా స్వయం కృషితో ఈరోజు ఈ స్థాయికి చేరుకున్నానని గర్వంగా చెప్పగలను అంటోంది మీరా. వెరీగుడ్!

చాడు రిసెప్షనిస్టు.

అది తెరిచి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు. శ్రీధర్ అతనికి రాసిన ఉత్తరం!

''డియర్ సర్!

మీరు వెళ్ళిపోయాక మీ మాటలు నా చెవుల్లో గింగురుమన్నాయి. తర్వాత మీటింగులో ఉన్నా మీరింకా నాతో ఏదో చెపుతున్నట్టే నాకనిపించింది. సాయంత్రం తిరిగివచ్చాక చాలాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాను. సూటుకేసులో పెట్టుకున్న ఆ డబ్బు పేకెట్‌ని పైకి తీసాను. రూపాయి రూపాయి ఆంటీ ఎలా జాగ్రత్త పెట్టారో! లిస్టు చదివాక నాకు భయంతో ఒళ్ళు ఝల్లుమనిపించింది. ఒక్క మాట కోసం ఆంటీ అంత బాధ్యతని తలకెత్తుకున్నారా? నేను అమెరికాలో సంపాదిస్తున్న డాలర్లన్నీ ఈ రూపాయిల ముందు ఎందుకూ పనికి రానివనిపించాయి.




యధాలాపంగా మీరు చెప్పిన కవర్ని తెరిచాను. అందులో మా యింటి డాక్యుమెంట్లు మాత్రమే కాదు అంతకన్న ముఖ్యమైనదొకటుంది. మా అమ్మ నాకని రాసిన ఉత్తరం! మీరా ఉత్తరాన్ని నాకిచ్చి నాకెంతో మహోపకారం చేసారు!

తను ముందే చనిపోతానని తెల్సిన దానిలా తనకి ఆక్సిడెంటు కావటానికి ఆర్నెల్ల ముందు మా అమ్మ ఆ ఉత్తరం రాసింది. 'నువ్వెప్పుడు వస్తావో! నిన్నెప్పటికి చూస్తానో! ఒకవేళ నిన్ను చూడలేకపోతే నీకు చెప్పాలనుకుంటున్న విషయాలు నీకు తెలిసేదెలా? అందుకే నీకీ ఉత్తరం రాసి పెడుతున్నాను నాన్నా!' అంటూ ఎంతో ఇదిగా రాసింది.

అమ్మదీ, ఆంటీదీ చిన్ననాటి స్నేహమని నాకు తెల్సు. మా అమ్మా, నాన్న ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వాళ్ళెంతో ఆదరించారనీ తెల్సు. కానీ నాకు తెలియని సంగతులు ఇంకా ఎన్నో మా అమ్మ ఉత్తరంలో ఉన్నాయి. నా పదో యేట నాకు బ్రెయిన్ ట్యూమర్‌కి ఆపరేషన్ అయితే అందుకు నాకు రక్తదానం చేసారుట. ఇంజినీరింగులో సీటు వచ్చి ఫీజు కట్టలేకపోతే తన ప్రావిడెంటు ఫండు నుంచి డబ్బు తెచ్చారుట. తనని, నన్ను ఎన్ని విధాల ఆ దంపతులు ఆదుకున్నారో ఆ ఉత్తరంలో చాలా విషయాలు రాసింది అమ్మ. ఇవేళ నువ్వు ఇంత స్థితికి రాగలిగావంటే వాళ్ళు పెట్టిన భిక్షే నాన్నా! మన చర్మాలతో చెప్పుకు కుట్టినా వాళ్ళ ఋణం మనం తీర్చుకోలేము అని మా అమ్మ రాసింది సార్!

ఒక్కసారి వెనక్కి చూసుకుంటే నాకు అంకుల్ జీవనప్రదాతే కాదు, ప్రాణప్రదాత. ఇప్పుడాయన ప్రాణాపాయ స్థితిలో ఉంటే నా ఋణం తీర్చుకోవల్సిన బాధ్యత నామీద లేదా? ఈ వ్యవస్థ బాగుపడాలంటే ఆంటీ, అంకుల్ లాంటి త్యాగమూర్తుల్ని బ్రతికించుకోవల్సిన ధర్మం నాకు లేదా? లేకపోతే ఈ వ్యవస్థని పాడు చేస్తున్న వాళ్ళల్లో నేనూ ఒకడ్ని అయిపోనా?

మీరు నా కళ్ళు తెరిపించారు. మా అమ్మ నా మనస్సుని తెరిచి పెట్టింది. ఇప్పుడు నా బాధ్యత ఏమిటో నాకు బాగా తెల్సింది. నా వ్యాపారం ఆగగలదు. డబ్బుపోతే మళ్ళీ సంపాదించుకోగలం. మంచి మనుషుల్ని మళ్ళీ సంపాదించుకోలేము. అందుకే నేనిప్పుడు అమెరికాకి వెళ్ళిపోవటం లేదు.

ఈ మట్టిని నేను తిట్టాను. కానీ ఈ మట్టిలోని సువాసనని మీరు నాకు చవి చూపించారు. ఇప్పుడా మట్టిలో పుట్టినందుకు గర్విస్తున్నాను.

ఆపరేషన్ అయ్యేవరకూ ఈ సంగతి ఆంటీకి, అంకుల్‌కి చెప్పద్దు. వాళ్ళకు తెలిస్తే నన్నీ పని చెయ్యనివ్వరు. నా బాధ్యతని నిర్వర్తించుకోవటంలో నాకీ సహాయం చేసి పెట్టండి.

మీరు నాకేమీ కాకపోయినా నాకిబ్బంది కలుగుతోందని అన్నానని డ్రాఫ్టు తెచ్చి పెట్టటానికి వస్తానన్నారు. నాకిప్పుడా డ్రాఫ్టు అవసరం లేదు. ఆ డబ్బుని అంకుల్ ఆపరేషన్‌కి ఉపయోగిద్దాము.

మీ అడ్రసుని దయయుంచి రిసెప్షన్‌లో ఇచ్చి వెళ్ళండి. నేను సాయంత్రం మీ యింటికి వస్తాను. అంకుల్ ఆపరేషన్ ఎక్కడ ఎప్పుడు ఎలా చేయించాలో అన్నీ డిస్కస్ చేద్దాము. నా మిషన్ సక్సెస్ కావాలంటే మీ సహకారం చాలా అవసరం. మీలాంటి గొప్ప వ్యక్తితో పరిచయం కావటం నా అదృష్టం.

అంతవరకూ శలవ్!

-శ్రీధర్'

☆

## మరో సినిమా పెళ్లి!

**ఆమీర్ ఖాన్ పెళ్లి మళ్లీ పెడాకులు కాబోతోందనే వార్త అకస్మాత్తుగా గుప్పుమందిప్పుడు. మొదటి భార్య రీనాకి విడాకులిచ్చేశాక- కొన్నాళ్లు 'ఒంటరి'గానే వున్న ఆమీర్ ఖాన్ 'రంగ్‌దే బసంతీ', 'మంగల్‌పాండే' సినిమాలకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన కిరణ్‌తో ప్రేమాయణం సాగించి గత ఏడాదే పెళ్లి కూడా చేసుకున్నాడు. కానీ వీళ్లిద్దరి మధ్యా అప్పుడే గొడవలు బయల్దేరి విడిపోయే వరకూ దారితీయనుందని సినీ జనాల ఉవాచ. సినిమాలకు దర్శకత్వం వహించాలనే కోరిక గల కిరణ్- తన కోరిక నెరవేరడంతో ఆమీర్ సహకారాన్ని ఆశించి, అతన్నుంచి తిరస్కారం ఎదురుకావడంతో నిరాశకు గురై గొడవలు మొదలయ్యాయిట. ప్చ్! సినిమా పెళ్లిళ్లు మరి!**

